క్లుప్తంగా

సర్పంచ్‌కు పరామర్శ



రాజాపూర్: మండలంలోని కొర్రతండా సర్పంచ్ హన్మనాయక్ అనారోగ్యంతో ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆదివారం దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. హన్మనాయక్ కుటుంబానికి అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.

శిక్షణ కోసం ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌కు చెందిన శ్రీనివాసాచారి కుమారుడు శశాంత్ ఇటీవల పోలీస్ ఉద్యోగానికి నిర్వహించిన ఫిజికల్ టెస్టులో అర్హత సాధించి రాత పరీక్ష కోసం శిక్షణ పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి శిక్షణ కోసం తన వంతు సాయంగా రూ.10వేలను అందించాడు. ఆదివారం స్థానిక సర్పంచ్ జయన్నగౌడ్ శశాంత్ తండ్రి శ్రీనివాసాచారికి అందజేశారు.

వార్డు కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడింది టీడీపీ అని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 13వ వార్డులో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సత్యయ్య, బాలాజీ, దుర్గ, సాయమ్మ, వెంకటమ్మ, జమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్ 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రేమ్‌రంగా గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి 40మంది హాజరు కాగా, విద్యాబోధన నేర్పిన ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాలస్వామి, జానకిరాములు, సత్యనారాయణరెడ్డి, విజయభాస్కర్‌లను సన్మానించారు.

క్రీడలతో మానసికోల్లాసం



బాలానగర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉమ్మడి పాలమూరు–రంగారెడ్డి జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు క్రీడాకారులను పరిచయం చేశారు. అనంతరం ఎర్రశేఖర్ మాట్లాడుతూ క్రీడాలతో మంచి భవిష్యత్తు ఉంటుందని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతి, హరిసింగ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఇంటింటి పర్యటన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిన్నదర్పల్లి కౌన్సిలర్ లతశ్రీ ఆదివారం ఇంటింటి పర్యటన చేశారు. ఆదివారం మార్నింగ్ వాక్ ద్వారా చిన్నదర్పల్లిలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు రమేశ్ నాయక్, నాగరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం



నవాబుపేట: మండలంలోని పోమాల్ సమీపంలో గల హజ్రత్ మాలిక్‌షా దర్గా ఉర్సు ఆదివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న గంధోత్సవం, ఖవాలి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు మునిరుద్దీన్ ఖాద్రీ తెలిపారు. మండల కేంద్రంలోని మునీరుద్దీన్ ఇంటి నుంచి గంధోత్సవ ఊరేగింపు నిర్వహించారు. మత సామరస్యాలకు ప్రతీకగా ఈ ఉర్సులో అందరూ పాల్గొని కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. పోమాల్, కామారం తదితర గ్రామాల ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఐక్యంగా అభివృద్ధికి కృషి చేయాలి

నారాయణపేట టౌన్: తొగట వీర క్షత్రీయులు ఐక్యంగా అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చింత శంకర్ అన్నారు. స్థానిక బ్రాహ్మణ్‌వాడి చౌడేశ్వరి మాత మందిరంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ఐక్యంగా అభివృద్ధి చేపట్టేందుకు ప్రతిజ్ఞ చేశారు.

ప్రశాంతంగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ సీతారామారావు



నవాబుపేటలో..



చిన్నచింతకుంటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

చిన్నచింతకుంట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారామరావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ చెన్నకిష్టన్న తెలిపారు. మండలంలో 55 ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 21 మంది పోటీలో ఉన్నారని, ఉదయం 8గంటల నుంచి సాయత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని తహసీల్దార్ చెన్నకిష్టన్న వివరించారు. ఇద్దరు పోలింగ్ అధికారులు, నలుగురు అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఒకరు మైక్రోపోలింగ్ అధికారి, ఐదుగురు సిబ్బందిని నియమించినట్లు ఆయన వెల్లడించారు.

నవాబుపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఎన్నికల అధికారి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పోలింగ్‌కు సిబ్బంది, పోలీసు యంత్రాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ స్టేషన్ బూత్ నెంబర్ 9లో దేవరకద్ర మండలానికి సంబంధించి మొత్తం 29 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు.

గండేడ్: మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నాడు ఉదయం 8గంటల నుంచి పోలింగ్ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. మహమ్మదాబాద్, గండేడ్ మండలాల్లో కలిపి 115 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేశారు.

ధైవచింతనతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిన్నాయిపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భక్తిభావం వెల్లివిరుస్తుందని, దైవచింతనతో సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ మధులత, రాణి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడికి ఘన నివాళి



గండేడ్: కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో పంచాయతీ కార్మికుడు కొంగబాబు మృతి విషాదకరమని డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు రాకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. తక్కువ వేతనంతో పని చేస్తూ అదే జీతంతో ఆధారపడ్డ వారికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే ఎలాగని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, మల్కయ్య, చిన్న హన్మయ్య, సుదర్శన్, నర్సమ్మ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తుంకినీపూర్‌లో వనభోజనాలు

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ గ్రామస్తులు ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయమే గ్రామస్తులందరూ వంట సామగ్రితో పొలాలకు చేరుకొని చెట్ల కింద వంటలు చేసి అక్కడే వనభోజనాలు చేశారు. ఇదిలా ఉండగా, గ్రామంలోకి ఎవరూ వెళ్లకుండా గ్రామ సేవకులను పహారా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



వనభోజనాల కోసం వెళ్తున్న గ్రామస్తులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో రవికుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్లలో ఆదివారం నిర్వహించిన సౌతిండియా కరాటే టోర్నీలో ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ కె.రవికుమార్ తెలిపారు. ఆయా విభాగాల్లో – 37కేజీలో దీపేష్, – 27కేజీలో దీక్షిత్, –20 కేజీలో రిత్విక్, – 30కేజీలో అఖిలేష్ బంగారు పతకాలు, అగస్త్య బంగారు పతకం, దినేష్, రోహిత్,అభినవ్ రజత పతకాలు సాధించారన్నారు.

వరండాలో తరగతులు

మరికల్: మండలంలోని తీలేర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవు. దీంతో వరండాలోనే విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 237 మంది విద్యార్థులు ఉండగా 6 గదులు ఉన్నాయి. మరో రెండు గదులు అవసరమవుతాయి. వారం రోజుల క్రితం పాఠశాల విజిట్‌కు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన దృష్టికి గ్రామస్తులు, ఉపాధ్యాయులు గదుల కొరత విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన ఆమె గదుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.



నాణ్యతకు తిలోదకాలు

- సీసీ రోడ్ల నిర్మాణాల్లో పాటించని నిబంధనలు
- వాగు ఇసుకకు బదులుగా ఫిల్టర్ వాడకం
- అధికారుల పర్యవేక్షణ శూన్యం



పోతన్‌పల్లిలో ఫిల్టర్ ఇసుకతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామాల్లో కనీస సౌకర్యాల్లో ముఖ్యమైనది రోడ్ల నిర్మాణం. రూ.కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే కొంత కాలానికే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మహబూబ్‌నగర్ మండలంలోని ఏ గ్రామంలో చూసినా సీసీ రోడ్ల నిర్మాణంలో డొల్లతనం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది. ఇందుకు పంచాయతీరాజ్ ఇంజినీర్ల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలో ఇలా..

ఎన్ఆర్ఈజీఎస్ కింద మండలంలోని 26 గ్రామాల పరిధిలో సుమారు రూ.4.40కోట్ల పనులు చేపట్టారు. చాలా చోట్ల ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లుగా మారి పనులు దక్కించుకున్నారు. అయితే ఈజీఎస్ పనుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో రాతిపొడి వాడుతున్నారు. వాగు ఇసుకకు బదులుగా కృత్రిమంగా తయారు చేసిన ఫిల్టర్ ఇసుకను ఉపయోగిస్తున్నారు. 25శాతం రాతిపొడి వాడాలని నిబంధనల్లో ఉన్నా మేము ఇక్కడ వాడడం లేదని పంచాయతీరాజ్ అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. వంద శాతం వాగు ఇసుకనే వాడాల్సి ఉండగా, పీఆర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఫిల్టర్ ఇసుకతో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నెలాఖరులోగా సీసీరోడ్ల పనులు ముగించకుంటే నిధులు ల్యాప్స్ అయ్యే అవకాశం ఉందని భావించి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. కోట్లాది రూపాయలు కదా.. ముందుగా పనులు జగరని.. ఆ తర్వాత ఎంబీ రికార్డులు, పర్సంటేజీల వ్యవహారం చూసుకుందామని పంచాయతీరాజ్ అధికారులు బహిరంగంగానే చెబుతుండడం విశేషం. ఇదిలా ఉండగా కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల విషయంలో ఎంబీ రికార్డుల తమకు కావాలన్నా పీఆర్ అధికారులకు పర్సంటేజీలు ఇవ్వాల్సిందేనన్న ఆరోపణలు లేకపోలేదు. లేదంటే బిల్లులు ఆగిపోతాయని, నిధులు వెనక్కి మళ్లీ పోతాయి. తీవ్రంగా నష్టపోతామని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. గత్యంతరం లేక వారు పంచాయతీరాజ్ అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

అధికారి పేరు చెబితేనే హడల్..

మండలంలో పంచాయతీరాజ్ అధికారిగా పనిచేస్తున్న సదరు అధికారి పేరు చెబితేనే కాంట్రాక్టర్లు హడలిపోతున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఎంతోమంది పీఆర్ ఏఈలు పని చేసినా.. ఇతడి మాదిరిగా అడ్డగోలు వ్యవహారం లేదని కాంట్రాక్టర్లు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పర్సంటేజీలకే ప్రాధాన్యత ఇస్తూ పనులపై నిర్లక్ష్యం చేస్తున్న ఏఈపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కాంట్రాక్టర్లు ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. స్వయంగా మంత్రి హెచ్చరించినా అధికారి పని తీరులో మార్పు లేకపోవడంపై ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సూగూరుగడ్డ తండాలో గతేడాది నిర్మించిన సీసీరోడ్డుపై తేలిన కంకర



మాచన్‌పల్లిలో సీసీ రోడ్ల నిర్మాణంలో ఉపయోగించిన రాతి పొడి, ఫిల్టర్ ఇసుక

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

భూత్పూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని భట్టుపల్లికి చెందిన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు గంగాధర్, 20 మంది బీజేపీ పార్టీకి చెందిన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నారాయణ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రాము రాథోడ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

వేతనాలు రాక వెతలు



రాజాపూర్ హైవేపై పారిశుద్ధ్య పనులు చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

- గ్రామ పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- పట్టించుకోని అధికారులు

రాజాపూర్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై గ్రామ పంచాయతీ కార్మికులపాత్ర ఎంతో ముఖ్యం. గ్రామ పంచాయతీ కార్మికులకు నెలనెలా తమకు రావాల్సిన వేతనాలు సకాలంలో అందక మల్టీపర్పస్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో దాదాపు 78 మంది మల్టీపర్పస్ కార్మికులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం వారికి నెలకు రూ.8,500లు వేతనంగా ఇస్తుంది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనులు చేస్తున్న వారికి ప్రభుత్వం సకాలంలో వేతనాలను వారిఖాతాల్లో జమచేయకపోవడంతో జీతాలు అందక వారు మూడు నెలలుగా సతమతమవుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు మావి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, అనారోగ్యాలకు గురవుతున్నా పరిశుభ్రత పనులు చేపట్టాల్సిందే. వేతనం ఇవ్వక ఇప్పటికే మూడు నెలలైంది. సకాలంలో ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– పద్మమ్మ, కార్మికురాలు

ఉన్నతాధికారులకు విన్నవించాం..



ప్రతి నెలా ఒకటవవ తేదీనే చెక్కు జనరేట్ చేసి ఎస్‌టీఓలో సబ్‌మీట్ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాలేదు. కార్మికులకు వేతనాలు రాకపోవడంతో గ్రామ పంచాయతీలో అడుగుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు విన్నవించాం.

– లక్ష్మీనారాయణగౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రాజాపూర్

మహిళలకే మొదటి ప్రాధాన్యం



మహిళా దినోత్సవ వేడుకలో పాల్గొన్న శారద తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాల్లో మొదటి ప్రాధాన్యం మహిళలకే ఇస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీమణి శారద అన్నారు. జిల్లా కేంద్రం మోనప్పగుట్టలోని మోనేశ్వరస్వామి దేవాలయ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శారద మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఇళ్లను మహిళల పేరిట ఇస్తున్నారని, ఇటీవల ప్రవేశపెట్టిన సొంత ఇంటి నిర్మాణ పథకానికి కూడా గృహలక్ష్మీ పేరు పెట్టినట్లు తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రుణాల సాయంతో సొంతకాళ్లపై నిలబడి ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కోఆప్షన్ సభ్యురాలు జ్యోతి, మహిళా మండలి సభ్యులు తాటి లక్ష్మి, సుజాత, రమాదేవి, యాదమ్మ, స్వప్న, మాలతి, సరోజ, సహేరా, విమల, వసంత, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సమితి బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సభ్యులు వంశీలత మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో ఉన్నత శిఖరాలు చేరుకుంటున్నారని, మగవాళ్లకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళలు అంతరిక్షంలో కూడా తమ సత్తా చాటుకుంటన్నారని, తల్లిదండ్రులు కూడా బాలికలను విద్యలో ప్రోత్సహించి వారిని స్వశక్తితో ఎదిగి జీవితంలో స్థిరపడేలా తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం మహిళలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉదయశ్రీ, ప్రధాన కార్యదర్శి పద్మజారెడ్డి, ఉపాధ్యక్షురాలు శశికళ, వరలక్ష్మి, నర్మద, శ్రీదేవి, వనజ, వినోద, కవిత, హేమలత, స్వరూప, మాధవి, సుమతి, పుష్పలత, సునీత పాల్గొన్నారు.